సాక్షి ఖమ్మం

శనివారం। 22। ఫిబ్రవరి। 2025



చెరువు ఆక్రమణలపై సర్వే

నేలకొండపల్లి మండలం చెరువుమాదారం చెరువు శిఖం కబ్జా అయిందన్న ఫిర్యాదుతో అధికారులు సర్వే నిర్వహించారు. 8లో



సమస్యలు పరిష్కరించాలని..

పోస్టుల భర్తీ, రెగ్యులరైజేషన్ తదితర సమస్యలు పరిష్కరించాలని యూఎఫ్‌బీయూ పిలుపుతో బ్యాంకు ఉద్యోగులు నిరసన తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
36° / 21°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం, రాత్రి చలిగాలుల తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం మాత్రం ఉష్ణోగ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

శైవక్షేత్రాలకు 75 ఆర్టీసీ బస్సులు



డిపో ఉద్యోగులతో మాట్లాడుతున్న ఆర్‌ఎం సరిరామ్

సత్తుపల్లి టౌన్: మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలకు వెళ్లివచ్చే భక్తుల కోసం ఈనెల 26, 26వ తేదీల్లో 75 ఆర్టీసీ సర్వీసులు నడిపించనున్నట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ ఏ.సరిరామ్ తెలిపారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపోను శుక్రవారం ఆయన డిప్యూటీ ఆర్‌ఎం జీఎన్.పవిత్రతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల శిక్షణ తరగతులను పరిశీలించాక ఆర్‌ఎం మాట్లాడారు. మహాశివరాత్రి సందర్భంగా సత్తుపల్లి డిపో నుంచి నీలాద్రికి, ఖమ్మం డిపో నుంచి తీర్థాలకు 25 చొప్పున, వైరా నుంచి స్నానాల లక్ష్మీపురానికి పది, భద్రాచలం డిపో నుంచి మోతెగడ్డకు ఐదు, కొత్తగూడెం డిపో నుంచి నీలాద్రి, అన్నపురెడ్డిపల్లి, బెండాలపాడులకు పది ఆర్టీసీ బస్సులు నడిపించనున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా సర్వీసుల సంఖ్య పెంచుతామని వెల్లడించారు. అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, వీబీఓ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రంలో 'ఎన్‌క్వాస్' పరిశీలన

చింతకాని: మండలంలోని చిన్నమండవలో ఆయుష్మాన్ ఆరోగ్య ఉపకేంద్రాన్ని నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ స్టాండర్డ్(ఎన్‌క్వాస్) బృందం శుక్రవారం పరిశీలించింది. బృందం సభ్యులైన డాక్టర్ దయాసిస్ సాహు, డాక్టర్ యోగేష్ వర్చువల్‌గా కేంద్రాన్ని పరిశీలించి ఏడు విభాగాల్లో సేవలపై ఆరా తీశారు. ఇక్కడి నుంచి హాజరైన డీఎంహెచ్‌ఓ డాక్టర్ కళావతిబాయి, అధికారులు ఆస్పత్రి ద్వారా అందుతున్న సేవలు, మందులు, వ్యాక్సినేషన్ల నిల్వ, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను వివరించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ చందూనాయక్‌తో పాటు ఉద్యోగులు, వైద్యులు రామారావు, ఉపేందర్, ఖదర్ అల్తాఫ్, సాయికుమార్, అనిల్, సోహెల్, కృష్ణారావు, జ్యోతిరత్న పాల్గొన్నారు. కాగా, మండలంలోని నాగులవంచ, పందిళ్లపల్లి ఆరోగ్య ఉప కేంద్రాలను డీఎంహెచ్‌ఓ తనిఖీ చేసి సేవలపై ఆరా తీశారు.

గురుకులంలో జాయింట్ సెక్రటరీ తనిఖీ



మద్దిలేటిని సన్మానిస్తున్న ఆర్‌సీఓ, తదితరులు

కొణిజర్ల: కొణిజర్ల మండలం అమ్మపాలెంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను బీసీ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ ఎం.మద్దిలేటి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించి శ్రద్ధగా చదివి మెరుగైన మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఆతర్వాత స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించిన ఆయన నిర్వహణపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. కాగా, క్రాఫ్ట్ విభాగం విద్యార్థులు రూపొందించిన వస్తువులు చూసి అభినందించారు. ఖమ్మం ఆర్‌సీఓ రాంబాబు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి రేపు పరీక్ష

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ఐదు నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలు కల్పించేందుకు ఆదివారం పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల జోనల్ ఆఫీసర్ కె.స్వరూపరాణి తెలిపారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని వెల్లడించారు. https:// tgswreis.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌తో నిర్ణీత సమయానికి హాజరుకావాలని, హాల్‌టికెట్‌పై తప్పులు ఉంటే ఇన్విజిలేటర్‌కు చెప్పి తగిన పత్రాలు సమర్పించి సరిచేయించుకోవాలని సూచించారు. కాగా, భద్రాద్రి జోన్‌లో 25,318 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని ఆమె తెలిపారు. ఇందులో ఖమ్మం జిల్లాలో 6,403 మంది విద్యార్థులకు 13 సెంటర్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 5,090 మందికి 18, మహబూబాబాద్ జిల్లాలో 5,263 మందికి 15, హన్మకొండ జిల్లాలో 4,470 మందికి 16, వరంగల్ జిల్లాలో 4,092 మందికి 10 సెంటర్లు కేటాయించినట్లు జోనల్ ఆఫీసర్ వెల్లడించారు.

బోనస్.. మైనసేనా?



ధాన్యం కేంద్రంలో కాంటా వేస్తున్న రైతులు, హమాలీలు (ఫైల్)

పౌర సరఫరాల సంస్థ ఏర్పాటుచేసిన కేంద్రాల్లో సన్నధాన్యం అమ్మిన రైతులు దాదాపు సగం మందికి ఇంకా బోనస్ అందలేదు. ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్లు ముగిసినా బోనస్ జమ కాకపోవడంతో ప్రతీరోజు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లాలో 27,26,660 క్వింటాళ్ల సన్న ధాన్యం అమ్మిన 47,494 మంది రైతులకు రూ.136,33,30,000 బోనస్ అందాల్సి ఉంది. ఇందులో పలువురికి రూ.64.42 కోట్ల మేర బకాయి ఉండగా ఎదురుచూపుల్లో గడుపుతున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

సన్నధాన్యం విక్రయించిన రైతుల ఎదురుచూపులు

- రూ.500 చెల్లింపు ప్రకటనతో సాగులో ముందడుగు
- మద్దతు ధర దక్కినా బోనస్ అందక నిర్లిప్తత



ధాన్యం అమ్మి రెండు నెలలు..

ఈ రైతు పేరు పోట్ల భాస్కర్. నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురానికి చెందిన ఈయన గ్రామంలోని పీఏసీఎస్ ద్వారా ఏర్పాటుచేసిన కేంద్రంలో గత ఏడాది డిసెంబర్ 15న 70 క్వింటాళ్ల సన్నరకం ధాన్యాన్ని విక్రయించాడు. రెండు నెలలు గడిచినా బోనస్ రాకపోవడంతో ప్రతిరోజూ బ్యాంకుకు వెళ్లివస్తున్నాడు. రూ.35 వేల మేర బోనస్ కోసం తన ఎదురుచూపులు ఎప్పుడు ఫలిస్తాయోనని ఎదురుచూస్తున్నాడు.

సన్న ధాన్యానికి జై కొట్టి..

ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురవడం, జలాశయాల్లో నీరు పుష్కలంగా ఉండడంతో రైతులు వరి సాగు చేపట్టారు. ఇంతలోనే సన్నరకం ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరకు తోడు రూ.500 బోనస్ ప్రకటించడంతో చాలామంది ఈ రకాలనే ఎంచుకున్నారు. జిల్లాలో 2,81,991 ఎకరాల్లో వరి సాగు చేయగా.. సన్న రకాలే 2,62,230 ఎకరాల్లో సాగయ్యాయి. కేంద్ర ప్రభుత్వం సాధారణ వరి రకాలు క్వింటాకు రూ.2,300, గ్రేడ్–ఏ(సన్న రకం) ధాన్యానికి రూ.2,320గా మద్దతు ప్రకటించింది. దీనికితోడు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందని ప్రకటించడంతో చాలామంది అటే మొగ్గుచూపారు.

344 కేంద్రాల ద్వారా సేకరణ

సన్నధాన్యాన్ని ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయిస్తే బోనస్ అందుతుందన్న విస్తృత ప్రచారంతో రైతులు ఆసక్తి కనబరిచారు. డీఆర్‌డీఏ, పీఏసీఎస్, డీసీఎంఎస్, మెప్మా ద్వారా 344 కేంద్రాలను ఏర్పాటు చేయగా గతనెల 31వ తేదీతో కొనుగోళ్లు ముగిశాయి. ఆతర్వాత వైరా మండలంలోని సిరిపురం, ఉప్పలమడకతోపాటు బోనకల్ మండలంలోని బ్రాహ్మణపల్లి, మోటమర్రి, కలకోటల్లో ఇంకా ధాన్యం మిగలడంతో మళ్లీ కొనుగోళ్లు చేశారు. మొత్తంగా 47,494 మంది రైతుల నుంచి 27,26,660 క్వింటాళ్ల సన్న రకం ధాన్యం సేకరించినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

మద్దతు ధర సరే బోనస్ ?

సన్నధాన్యం అమ్మిన రైతులకు మద్దతు ధరతో పాటే రూ.500 బోనస్ జమ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ చాలామందికి బోనస్ నగదు జమ కాలేదు. ధాన్యం విక్రయించి నెలలు దాటుతున్నా బోనస్ రాకపోవడంతో అసలు ఇస్తారా, లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈక్రమంలోనే ప్రతీరోజు బ్యాంకుల వెళ్లి ఖాతాల్లో బ్యాలెన్స్ పరిశీలించి వస్తున్నారు.

ఎందుకు రాలేదో.. ఏమో

సన్నధాన్యం విక్రయించిన రైతులకు విడతల వారీగా బోనస్ జమ అవుతూ వస్తోంది. మొత్తంగా జిల్లా రైతులకు రూ.136,33,30,000 బోనస్ జమ కావాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు రూ.71,90,84,600 మాత్రమే అందాయి. మిగతా రూ.64,42,45,400 నగదు రాకపోవడంతో రైతులు ఎదురుచూస్తున్నారు. బోనస్ నగదు వస్తే యాసంగి పంటల పెట్టుబడికి ఆసరాగా ఉంటుందని రైతులు భావించినా నిరాశే ఎదురవడంతో మళ్లీ అప్పులు చేసి సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

జిల్లాలో ధాన్యం విక్రయాలు, బోనస్ వివరాలు

సన్నధాన్యం విక్రయించిన రైతులు	ధాన్యం (క్వింటాళ్లు)	మొత్తం చెల్లించాల్సిన బోనస్	ఇప్పటి వరకు అందింది	ఇంకా బకాయి
47,494	27,26,660	రూ.136,33,30,000	రూ.71,90,84,600	రూ.64,42,45,400

ఇందిరమ్మ లబ్ధిదారులకు తోడ్పాటు

- యంత్రాంగం ద్వారా సంపూర్ణ అవగాహన కల్పించాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, అధికారులు

ఖమ్మంసహకారనగర్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు యంత్రాంగం ప్రతీ దశలో తోడ్పాటునందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాల అధికారులు, మండల ప్రత్యేక అధికారులకు ఇచ్చిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లతో ప్రజల జీవన విధానంలో మార్పులు వస్తాయని గుర్తించి అర్హులనే ఎంపిక చేయాలని తెలిపారు. గ్రామసభల్లో అందిన దరఖాస్తులను యాప్ ద్వారా మరోసారి పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని చెప్పారు. సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారు, స్థలం, ఇల్లు లేనివారు, ఆర్‌సీసీ రూఫ్‌తో ఇల్లు ఉన్న వారిని మూడు కేటగిరీలుగా విభజించాలని, అత్యంత పేదలు, సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అంతేకాక భూమి పూజ మొదలు గృహప్రవేశం వరకు ప్రతీ అడుగులో లబ్ధిదారులకు అండగా నిలిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని కలెక్టర్ తెలిపారు. కాగా, ఇసుక సరఫరాను పర్యవేక్షించాలని, సిమెంట్ తక్కువ ధరకు అందేలా ప్రయత్నాలు చేయాలని చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిశాక రెండు వారాల్లో బేస్‌మెంట్ పూర్తయ్యేలా చూస్తే లబ్ధిదారులకు రూ.లక్ష నగదు అందుతుందని కలెక్టర్ తెలిపారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, డీఆర్డీఓ సన్యాసయ్య, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డీపీఓ ఆశాలత, హౌజింగ్ పీడీ శ్రీనివాసరావు, పీఆర్ ఈఈ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా కలెక్టర్ జిల్లాలో ఏర్పాట్లను వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, పోలింగ్ ఉద్యోగులకు శిక్షణ, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాల ముద్రణ, పోస్టల్ బ్యాలెట్ జారీ, కేంద్రాల్లో చేస్తున్న ఏర్పాట్లను వెల్లడించారు. పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, డీఆర్వో ఏ.పద్మశ్రీ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వామి, డీటీ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

సైలోబంకర్‌కు పిండప్రదానం

ఉధృతరూపం దాల్చిన నిరసనలు



సైలోబంకర్ ఫొటో వద్ద పిండప్రదానం చేస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

సత్తుపల్లి: సత్తుపల్లిలోని సింగరేణి సైలోబంకర్ నుంచి వెలువడుతున్న దుమ్ముధూళితో శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నామని, ఇప్పటికే పలువురు మృతి చెందినందున బంకర్‌ను తొలగించాలనే డిమాండ్‌తో కిష్టారం అంబేద్కర్‌నగర్ వాసులు చేపట్టిన నిరసనలు ఉధృతరూపం దాలుస్తున్నాయి. ఈమేరకు 12వ రోజైన శుక్రవారం మృతుల కుటుంబీకులు సైలోబంకర్ చిత్రపటానికి పిండప్రదానం నిర్వహించి వినూత్న నిరసన తెలిపారు. అంతేకాక సైలోబంకర్ నిర్మించినప్పటి నుంచి మృతి చెందిన వారి ఫొటోలను దీక్షా శిబిరం వద్ద ప్రదర్శించగా పలువురు కంటతడి పెట్టుకున్నారు. కాగా, దీక్షలకు బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రజల ప్రాణాలు కోల్పోతున్నందున తక్షణమే మంత్రులు చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సైలో బంకర్‌ను నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మించినట్లు తెలుస్తున్నందున విచారణ జరిపించాలని కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. బీజేపీ నాయకులు నంబూరి రామలింగేశ్వరరావు, ఈ.వీ.రమేష్, నన్నే ఉదయ్‌ప్రతాప్, భాస్కర్ల వీరంరాజు, సుదర్శన్ మిశ్రా, నాయుడు రాఘవరావు, మట్టా ప్రసాద్, పాలకొల్లు శ్రీనివాసరావు, నాగస్వామి, బానోతు విజయ్, నల్లమోతు నాని, మధుసూదన్‌రావు, రహ్మతుల్లా పాల్గొన్నారు.

ఆయిల్‌ఫెడ్ డివిజన్ అధికారిపై వేటు

సత్తుపల్లి: సత్తుపల్లి డివిజన్ ఆయిల్‌ఫెడ్ అధికారి బాలకృష్ణపై సస్పెన్షన్ వేటు పడింది. ఈమేరకు ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్‌బాషా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని రేగళ్లపాడు నర్సరీలో ఆఫ్‌టైప్(నాటడానికి పనికి రానివి)గా తేలిన 80వేల ఆయిల్‌పామ్ మొక్కలను అనుమతి లేకుండా ధ్వంసం చేయించినట్లు ఆయనపై ఫిర్యాదులు వచ్చాయి. ఇందుకోసం వెచ్చించిన నిధులు డ్రా చేసినట్లు తెలుస్తుండగా, ఈనెల 9, 10వ తేదీల్లో ఉద్యానవన శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈమేరకు వారు ఇచ్చిన నివేదిక ఆధారంగా బాలకృష్ణను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. కాగా, గతంలోనే నర్సరీ సూపర్‌వైజర్లు పృథ్వీలాల్, కృష్ణారావును విధుల నుంచి తొలగించిన విషయం విదితమే.

అన్ని వసతులు ఉన్నాయా?

కేజీబీవీలో అదనపు కలెక్టర్ తనిఖీ



కేజీబీవీలో బాలికలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

పెనుబల్లి: పెనుబల్లి మండలంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ఈసందర్భంగా ఉప్పలచెలకలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ అమలు, బోధన, కరాటే శిక్షణ వివరాలు తెలుసుకున్నారు. కరాటే నేర్చుకోవడం ద్వారా ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం మండలం కేంద్రంలోని ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ యూరియా నిల్వల వివరాలు తెలుసుకున్నారు. అంతేకాక యడ్లబంజర్‌లో రైతులతో మాట్లాడి సాగు చేస్తున్న పంటలు, ఎరువుల లభ్యతపై ఆమె ఆరాతీశారు. అదనపు కలెక్టర్ వెంట వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థుల విజయం ఖాయం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణలో జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు ఖాయమని ఆ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పార్టీ బలపరుస్తున్న టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయనతో పాటు నాయకులు శుక్రవారం పలువురు ఉపాధ్యాయుల నివాసాలకు వెళ్లి ప్రచారం కోరారు. ఈసందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పీఆర్సీ అమలు, డీఏల విడుదలను విస్మరించిందని ఆరోపించారు. ఈమేరకు ఉపాధ్యాయులు బీజేపీ బలపర్చిన సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కాగా, సరోత్తంరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉపాధ్యాయులను కలిశారు. నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్, రమణారెడ్డి, పరిశ రామ్మోహన్, కె.శ్రీనివాసరావు, కరిన హరిప్రసాద్, భూక్య సేవ్యా, నకిరికంటి వీరభద్రం, శీలం పాపారావు, నున్నా రవికుమార్, కోటేశ్వరరావు, అల్లిక అంజయ్య, మందా సరస్వతి, దొడ్డ అరుణ తదితరులు పాల్గొన్నారు.


అతిథిగృహానికి త్వరలోనే పూర్వవైభవం!

కూసుమంచి: మండంలోని నాయకన్‌గూడెంలో జలవనరుల శాఖ పరిధిలో ఉన్న అతిథిగృహం(ఐబీ గెస్ట్ హౌజ్) త్వరలోనే పూర్వవైభవం సంతరించుకోనుంది. సాగర్ కాల్వల తవ్వకం జరిగే రోజుల్లో దీన్ని నిర్మించగా ఆతర్వాత వివిధ సందర్భాల్లో ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, ఎన్టీ రామారావుతో పాటు మంత్రులు, ఉన్నతాధికారులు బస చేశారని స్థానికులు చెబుతున్నారు. అయితే, కొన్నేళ్లుగా నిర్వహణ సరిగ్గా లేక భవనం శిథిలం కాగా, వదిలివేశారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాలతో అధికారులు రూ.18లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో భవనం స్లాబ్‌ను సరిచేయడమే కాక రంగులు వేయించి కొత్త ఫర్నీచర్ సమకూరుస్తారు. తద్వారా ఏళ్ల క్రితం నాటి గెస్ట్‌హౌస్ మళ్లీ కళకళలాడనుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జియోథర్మల్ విద్యుదుత్పత్తిలో ముందడుగు

- పూర్తిస్థాయి సామర్థ్యంతో ఉత్పత్తి నమోదు
- పగిడేరులో దేశంలోనే మొట్టమొదటి ప్లాంట్





పగిడేరులోని జియో థర్మల్ కేంద్రం (ఇన్‌సెట్) 20 కేవీ విద్యుత్ ఉత్పత్తి నమోదైనట్లు చూపిస్తున్న ప్యానల్ బోర్డు

మణుగూరు టౌన్: సింగరేణి సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జియోథర్మల్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులో ముందుడుగు పడింది. మండలంలోని పగిడేరులో బోరు నుంచి వస్తున్న వేడినీటితో జియోథర్మల్ విద్యుత్ ఉత్పత్తి చేయొచ్చని కొన్నేళ్ల క్రితం గుర్తించగా 20 కిలోవాట్ల సామర్థ్యంతో ప్లాంట్ ఏర్పాటు చేశారు. క్లోజ్డ్ లూప్ బైనరీ ఆర్గానిక్ ర్యాంకిన్ సైకిల్(ఓఆర్‌సీ) టెక్నాలజీతో రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టును సింగరేణి ఆధ్వర్యాన ఢిల్లీలోని శ్రీరాం ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ బాధ్యులు చేపట్టారు. ఈమేరకు రెండు రోజులుగా ఇక్కడ ప్రయోగాత్మకంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తుండగా 20 కిలోవాట్ల పూర్తిస్థాయి సామర్థ్యంతో నమోదైంది. ఇది విజయవంతమైన నేపథ్యాన ఇంకొన్ని పరీక్షలు చేసి పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తికి సిద్ధమవుతున్నట్లు సమాచారం.

దేశంలోనే తొలి కేంద్రం

జియోథర్మల్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తికి కేంద్రప్రభుత్వం 1960 నుంచే 'హాట్ స్ప్రింగ్స్' కమిటీ ఏర్పాటు చేసి పరిశోధనలు చేయిస్తోంది. ఈక్రమాన 1992లో హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని మణికరణ్ ప్రాంతంలో ఐదు కిలోవాట్ల ప్లాంట్ ఏర్పాటు చేసినా కొండచరియలు విరిగి పడడంతో అది ధ్వంసమైంది. ఆతర్వాత పలు రాష్ట్రాల్లో జియోథర్మల్ కోసం అన్వేషణలు సాగించినా విజయవంతం కాలేదు. చివరకు పగిడేరులో బొగ్గు అన్వేషణకు వేసిన బోర్ నుంచి వేడి నీరు ఉబికి వస్తుండడంతో జియోథర్మల్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటుచేశారు. కాగా, ప్రయోగాత్మకంగా చేపట్టిన ఉత్పత్తి పూర్తిస్థాయిలో నమోదైన నేపథ్యాన దేశంలోనే తొలి ప్లాంట్‌గా నిలవనుంది.

క్లుప్తంగా

అథ్లెట్‌ను అభినందించిన కలెక్టర్



మైథిలిని అభినందిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం స్పోర్ట్స్: ఇటీవల జరిగిన జాతీయ స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్, 38వ జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన అథ్లెట్ ఎ.మైథిలిని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శుక్రవారం అభినందించారు. ఆమె జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో ఒక స్వర్ణం, రెండు రజత పతకాలు, 38వ జాతీయ క్రీడల్లో కాంస్య పతకం సాధించడం జిల్లాకే గర్వకారణమని తెలిపారు. డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్ రెడ్డి, కోచ్‌లు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్ అలీ, అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్‌లు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెక్కులు అందించిన సీపీ



చెక్కులు అందుకున్న కుటుంబాలతో సీపీ, అదనపు డీసీపీ

ఖమ్మంక్రైం: అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన కొణిజర్ల పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఇ.లోకేశ్‌తోపాటు ఏఆర్ కానిస్టేబుల్ ఐ.బాలరాజు కుటుంబాలకు మంజూరైన భద్రతా ఎక్స్‌గ్రేషియా చెక్కులను పోలీసు కమిషనర్ సునీల్ దత్ అందజేశారు. రూ.8లక్షల చొప్పున చెక్కులను శుక్రవారం అందించిన ఆయన శాఖాపరంగా ఎలాంటి సహకారం కావాలన్నా అందుబాటులో ఉంటామని భరోసా కల్పించారు. అదనపు డీసీపీ నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెమీస్ దశకు చేరిన క్రికెట్ టోర్నీ



క్రికెటర్లను పరిచయం చేసుకుంటున్న ప్రవీణ్‌కుమార్

ఖమ్మం స్పోర్ట్స్: రాజీవ్‌గాంధీ స్మారక క్రికెట్ టోర్నీ సెమీస్ దశకు చేరింది. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న టోర్నీలో భాగంగా శుక్రవారం క్వార్టర్ ఫైనల్స్ నిర్వహించారు. ఈమేరకు ఖమ్మం అర్బన్, నేలకొండపల్లి, కల్లూరు, మణుగూరు జట్లు ప్రత్యర్థి జట్లపై విజయం సాధించి సెమీస్‌లోకి ప్రవేశించాయి. తొలుత మ్యాచ్‌లను డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించగా టోర్నీ నిర్వాహకులు ఎండీ.మతిన్‌తో పాటు సిద్ధు, నాగేశ్వరరాజు, జావెద్, ఇబ్రహీం, వెంకటేష్, అంజలి పాల్గొన్నారు.

'మెటా ఫ్లస్' బాధితుల ఆందోళన

ఖమ్మంక్రైం: రెట్టింపు డబ్బు అందుతుందని చెప్పి మోసం చేసిన మేటా ఫ్లస్ సంస్థ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు శుక్రవారం ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈమేరకు పలువురు మాట్లాడుతూ నవీన్, నజీర్ మెటా ఫ్లస్‌ను దుబాయి కంపెనీగా చెబుతూ పెట్టుబడి పెడితే పది నెలలో రెట్టింపు వస్తుందని ఆశ చూపారని తెలిపారు. అంతేకాక దుబాయి, గోవా పర్యటనకు తీసుకెళ్తామనడంతో భారీగా పెట్టుబడి పెట్టామని, ఇప్పుడు ముఖం చాటేశారని ఆరోపించారు. ఇదేమిటని నవీన్, నజీర్‌ను అడిగితే రౌడీషీటర్లతో బెదిరిస్తున్నారని తెలిపారు. ఈమేరకు పోలీసులు తమకు న్యాయం చేయాలని కోరారు. కాగా, ఈ అంశంపై విచారణ చేస్తున్నామని వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

క్షుద్రపూజలు చేశారని ఆందోళన

వైరా: వైరాలోని ఇందిరమ్మ కాలనీ సమీపాన ఓ రైతు పొలంలో గుర్తుతెలియని వ్యక్తులు చేసిన పూజలు చేసిన ఆనవాళ్లు ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. సదరు రైతు పొలంలో వరి నాట్లు వేయిస్తుండగా శుక్రవారం పాల ప్యాకెట్లు, నెయ్యి, టార్చ్‌లైటు, పసుపు, కుంకుమ కనిపించాయి. దీంతో క్షుద్రపూజలు చేశారని పేర్కొంటూ ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా, సిబ్బంది చేరుకుని విచారణ చేపట్టారు.

వివాహిత ఆత్మహత్య

వేంసూరు: మండలంలోని చౌడవరానికి చెందిన వివాహిత వి.జ్యోతి(19) శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈమేరకు ఏఎస్సై వెంకటేశ్వరరావు పరిశీలించి కేసు నమోదు చేశారు. అయితే, ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

అపు'రూపం'

- ఎక్కడున్నా కవలలకు ప్రత్యేక గుర్తింపు
- ఒకే పోలికలతో పలు సందర్భాల్లో తికమక
- నేడు కవలల దినోత్సవం

కవలలు (ట్విన్స్) ఎక్కడున్నా ప్రత్యేకత ఉంటుంది. రూపంలో ఒకేరకంగా ఉండటంతో వారిని ప్రత్యేకంగా చూస్తారు. తల్లిదండ్రులు వారికి ఒకే రకమైన దుస్తులు, వస్తువులు కొనిపెట్టి అపురూపంగా చూసుకుంటారు. ఇష్టాలు, అభిరుచులు ఒకేలా ఉంటే మరికొందరిలో భిన్నంగా ఉంటాయి. బంధువులు, టీచర్లు, ఇరుగుపొరుగు వారు కూడా గుర్తుపట్టలేక తికమకపడుతుంటారు. ప్రపంచంలో మొదటి సారి కవలలు దినోత్సవాన్ని పోలాండ్‌లో 1976లో నిర్వహించారు. మోజస్, అరన్విల్కార్క్స్ కవలలు ఒకే వ్యాధితో బాధపడుతూ ఒకే రోజు (ఫిబ్రవరి 22) మరణించారు. దీంతో ఏటా ఫిబ్రవరి 22న ప్రపంచ కవలల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

– కొణిజర్ల/నేలకొండపల్లి

గుర్తుపట్టడం కష్టమే..



కొణిజర్లకు చెందిన తాటికొండ నరసింహాచారి, పార్వతి దంపతుల కవల కుమారులు రామ్, లక్ష్మణ్ నాలుగో తరగతి చదవుతున్నారు. ఇద్దరు అచ్చుగుద్దినట్లు ఒకేలా ఉండటంతో తల్లిదండ్రులు, వారి సోదరి తప్ప మిగతా గుర్తుపట్టడం కష్టమే. వీరికి ఒకే రకమైన దుస్తులు వేయడంతో పాటు కేశాలంకరణ సైతం ఒకే మాదిరి తీర్చిదిద్దడంతో ఉపాధ్యాయులు, స్నేహితులు కూడా తికమక పడతారట.

పోటాపోటీగా చదువు



నేలకొండపల్లికి చెందిన గోపి ఉపేందర్–నాగలక్ష్మి దంపతులకు వర్షిణి–హర్షిణి కవల పిల్లలు ఉన్నారు. వీరి వయస్సు 11ఏళ్లు. వీరు ఒకరికి ఒకరు ప్రతిరూపంలా కనిపిస్తారు. ఒకరిని విడిచి ఒకరు ఉండలేరని, అభిప్రాయాలు, అభిరుచులు ఒకేలా ఉంటాయని తల్లిదండ్రులు తెలిపారు. అంతేకాక చదువులోనూ పోటీ పడతారని వెల్లడించారు. వీరిద్దరూ నేలకొండపల్లి గురుకులంలో ఆరో తరగతి చదువుతున్నారు.

అన్నింటా ముందంజ



కామేపల్లి మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన కోదం సుభాష్‌వర్ధన్, సుహాస్‌వర్ధన్ పాల్వంచ మండలం కిన్నెరసానిలోని గిరిజన క్రీడాపాఠశాలలో 5వ తరగతి చదువుతున్నారు. ఇద్దరూ చదవడం, అల్లరి చేయడంలో ముందుంటారు. దుస్తులు, ఇతర ఏ వస్తువు కొన్నా ఇద్దరికీ ఒకేలా ఉండేలా అందిస్తామని, అభిరుచులు కూడా ఒకే రకంగా ఉంటాయని తల్లిదండ్రులు రాంబాబు, సులోచన వెల్లడించారు.

చెరువు ఆక్రమణలపై డిజిటల్ సర్వే



సర్వే కోసం పడవలో వెళ్తున్న ఉద్యోగులు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువు శిఖం కబ్జా అవుతోందన్న ఫిర్యాదుతో అధికారులు రంగంలోకి దిగారు. చెరువు శిఖాన్ని పూర్తిస్థాయిలో సర్వే చేసి హద్దులు నిర్ధారించాలని మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు ఖాసిం, ఉపాధ్యక్షులు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, బలరాం ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చెరువు విస్తీర్ణంపై ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు చెబుతున్న లెక్కలకు పొంతన లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కలెక్టర్ సూచనల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్, మత్స్య శాఖ అధికారులు శుక్రవారం సంయుక్తంగా సర్వే చేపట్టారు. పడవ ద్వారా చెరువులోకి వెళ్లి డిజిటల్ సర్వే చేశారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ ఏడీ జి.శివప్రసాద్ మాట్లాడుతూ చెరువు శిఖం ఆక్రమణకు గురైనట్లు తేలినా, చేపల కుంటలు నిర్మించినట్లు గుర్తించినా బాధ్యులకు నోటీసులు ఇచ్చి స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. కాగా, చికెన్ వ్యర్థాలను చెరువులో వేసే వారిపైనా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఈ నరేష్, సర్వేయర్ మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికులను ఆదుకోవాలి

టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం



మాట్లాడుతున్న టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చే విధానాలు మానుకుని బస్తాలు మోసే హమాలీల సంక్షేమంపై దృష్టి సారించాలని టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, తెలంగాణ ప్రగతిశీల హమాలీ–మిల్లు వర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. యూనియన్ నాలుగో రాష్ట్ర మహాసభలు ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. తొలుత నగరంలో ప్రదర్శన నిర్వహించగా, సమావేశంలో సూర్యం, శ్రీనివాసరావు మాట్లాడారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. కార్మికులకు కేంద్ర, రాష్ట్ర పాలకులు ఎలాంటి చట్టబద్ధమైన హక్కులు కల్పించకపోవడంతో శ్రమదోపిడీకి గురవుతున్నారని తెలిపారు. ఇకనైనా కార్మికుల సంక్షేమం, హక్కుల కల్పనకు సమగ్ర చట్టాన్ని రూపొందించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పీఎఫ్ అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సభలో టీయూసీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.రామయ్య, నాయకులు ఆవుల అశోక్, యాకూబ్‌షావలీ, ఎస్.కిరణ్ మాట్లాడగా ఏ.వెంకన్న, జక్కుల యాకయ్య, గొల్ల సీతారాములు, ఎం.నరసింహులు, ఎస్.శ్రీనివాసులు, ఏ.అంజనేయులు, కె.లక్ష్మణ్, కె.శ్రీనివాస్, కె.పుల్లారావు, బొమ్మకంటి రమేష్, నవీబాయి, గోపాల్, లూథర్, జగన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పనులు లేక, పస్తులు ఉండలేక..

వలస బాట పడుతున్న కూలీజనం



పనుల కోసం వెళ్లపోవడంతో తాళం వేసిన ఉన్న ఓ వ్యక్తి ఇల్లు

నేలకొండపల్లి: ఉన్న ఊరిలో పనులు లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఎదురవడంతో తట్టుకోలేక పలువురు వ్యవసాయ కూలీలు వలస బాట పడుతున్నారు. కుటుంబాలతో ఇళ్లకు తాళాలు వేసి పనులు వెతుక్కుంటూ వెళ్లిపోతున్నారు. మండలంలోని బైరవునిపల్లి నుంచి సుమారు పది కుటుంబాలు ఇప్పటికే వలస వెళ్లినట్లు స్థానికుల ద్వారా తెలిసింది. గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించకపోవడం, కొంతకాలం ఇతర ప్రాంతాల్లో మిర్చి ఏరేందుకు వెళ్లినా ఆ పనులూ ముగియడంతో ఇబ్బంది పడుతున్నారు. ఈనేపథ్యాన కూలీలు కుటుంబాలతో సహా హైదరాబాద్, విజయవాడ ఇతరత్రా ప్రాంతాలకు వెళ్లారు. మరికొందరు వెళ్లిపోకముందే అధికారులు స్పందించి స్థానికంగా పనులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

వచ్చేనెల 7న వకుళామాత స్టేడియం ప్రారంభం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దాతలు, అర్చకులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గ్రామానికి చెందిన తుళ్లూరు కోటేశ్వరరావు–నిర్మల సమకూర్చిన నిధులతో వకుళామాత స్టేడియాన్ని నిర్మించారు. శ్రీవారి కల్యాణం నిర్వహణకు నిర్మించిన ఈ స్టేడియాన్ని వచ్చే నెల 7వ తేదీన ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ప్రచారానికి రూపొందించిన పోస్టర్లను శుక్రవారం జమలాపురం ఆలయంలో కోటేశ్వరరావు దంపతులు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి ఆవిష్కరించారు. అర్చకులు రాజీవ్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంతో 'రియల్' రంగానికి జీవం



మంత్రి పొంగులేటి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: ఎల్ఆర్‌ఎస్ దరఖాస్తులు పరిష్కరించేలా రాయితీ ప్రకటించడం ద్వారా రియల్ ఎస్టేట్ రంగానికి ఊపిరిలూదినట్లయిందని రియల్ ఎస్టేట్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేట క్రాస్‌లో శుక్రవారం అసోసియేషన్ బాధ్యులు గరికపాటి అంజనేయప్రసాద్, తుంపాల కృష్ణమోహపన్ మాట్లాడారు. గత ఎనిమిదేళ్లుగా రియల్ ఎస్టేట్ రంగం కుదేలు కావడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. రూ.కోట్ల విలువైన వెంచర్లు చేసినా 2020లో ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేయొద్దని ఇచ్చిన ఆదేశాలతో ప్లాట్లు అమ్ముకోలేకపోయామని చెప్పారు. ఎల్ఆర్‌ఎస్ రూపేణా నగదు చెల్లించినా సమస్య పరిష్కారం కాక హైకోర్టు నుంచి స్టే తెచ్చుకుంటే, సుప్రీంకోర్టుకు వెళ్లి అడ్డంకులు సృష్టించారన్నారు. ఈనేపథ్యాన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఎల్ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి రాయితీ ప్రకటించడంతో రియల్ ఎస్టేట్ రంగంపై ఆధారపడిన వారికి భరోసా కల్పించినట్లయిందని వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలపడంతో చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అసోసియేషన్ నాయకులు కిషోర్, మన్నేటి నాగేశ్వరరావు, షాబాదు మాధవరెడ్డి, ఉప్పుగుండ్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు, అధ్యాపకుల వెంటే ఉంటున్నా..

యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి



ఖమ్మంలో మాట్లాడుతున్న అలుగుబెల్లి నర్సిరెడ్డి, పక్కన నాయకులు

ఖమ్మం సహకారనగర్/కొత్తగూడెంఅర్బన్: నిరంతరం ఉపాధ్యాయులు, అధ్యాపకుల వెంటే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్నానని వరంగల్ - ఖమ్మం - నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. ఖమ్మం, కొత్తగూడెంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. 2019లో ఎమ్మెల్సీగా గెలిచాక సీపీఎస్ రద్దు, పెండింగ్ డీఏలు, ఈ–కుబేర్‌లో పెండింగ్ బిల్లుల విడుదల కోసం ధర్నాల్లో సైతం పాల్గొన్నట్లు చెప్పారు. అలాగే, గురుకులాల ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు, కేజీబీవీ ఉపాధ్యాయులకు వేతనం పెంపు, బదిలీలకు కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్సీగా తనకు కేటాయించిన రూ.9 కోట్ల నిధులను అదనపు తరగతి గదుల నిర్మాణానికి కేటాయించానని వెల్లడించారు. ఈ మేరకు 27న జరగనున్న ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని, తద్వారా మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లింపు, హెల్త్ కార్డులు, పదోన్నతులతో పాటు ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి పాటుపడతానని తెలిపారు. టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విజయ్ మాట్లాడగా యూటీఎఫ్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, ఏవీ నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావుతో పాటు జీవీ నాగమల్లేశ్వరరావు, చావా దుర్గాభవాని, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలోకి వ్యవసాయ రంగం



సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

ఖమ్మంరూరల్: కార్పొరేట్ శక్తులకు మేలు చేకూర్చేలా నిర్ణయాలు తీసుకుంటున్న పాలకులు వ్యవసాయ రంగాన్ని మాత్రం సంక్షోభంలోకి నెడుతున్నారని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు విమర్శించారు. రూరల్ మండలం ఆరేకోడులో శుక్రవారం జరిగిన ఏఐకేఎస్ సభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రధాని మోదీ పాత విధానంలోనే ముందుకెళ్తూ కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెడుతున్నారని ఆరోపించారు. ఇకనైనా రైతుల సమస్యలపై స్పందించి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల వరకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని, రైతుభరోసా నగదు జమ చేయాలని, ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానించగా, 21మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల కమిషన్ చైర్మన్ ఎండీ.మౌలానాతో పాటు దండి సురేష్, మిడకంటి చినవెంకటరెడ్డి, పగిళ్ల వీరభద్రం, గోవిందరావు, పుచ్చకాయల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు నీటి విడుదలపై ఫిర్యాదు

కామేపల్లి: మండలంలోని కొండాయిగూడెం పెద్దచెరువు నుంచి గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అనుమతి లేకుండా నీటిని విడుదల చేశారు. ఈవిషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఇరిగేషన్ డీఈఈ శంకర్ తెలిపారు. చెరువు నీటిని అక్రమంగా మోటార్ల ద్వారా తరలించినా, అనుమతి లేకుండా తూము నుంచి విడుదల చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, తూము వద్ద చేపల వలలు ఉండడం, ఆపై నీటిని విడుదల చేయడంతో ఇది మత్స్యకారుల పనేనని ఆయకట్టు రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ముందే స్పందిస్తే...

కొండాయిగూడెం పెద్ద చెరువు నుంచి కొన్నాళ్లుగా అక్రమంగా నీటిని తరలిస్తున్నారని తెలిసినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులో అక్రమంగా బావులు తవ్వించి మోటార్లు పెట్టి మరీ నీటిని ఎగువన ఉన్న పొలాలకు తరలించడం, చెరువు శిఖంలో పంటలు చేస్తుండడంతో తమకు నష్టం జరుగుతోందని పలువురు తెలిపారు. ఈవిషయమై పరిశీలంచాలని డీఈఈ, ఏఈఈలను ఉన్నతాధికారులు ఆదేశించడం స్పందించకపోవడం సరికాదని చెబుతున్నారు.

ఫుట్‌బోర్డ్ నుండి జారిపడిన డ్రైవర్‌కు గాయాలు

పెనుబల్లి: బస్సు ఫుట్‌బోర్డుపై నిల్చున్న వ్యక్తి జారి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కల్లూరు మండలం ముచ్చారానికి చెందిన ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ వసుపులేటి పుల్లారావు శుక్రవారం ఖమ్మం వైపు నుండి సత్తుపల్లి వైపు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నాడు. ఆయన ఫుట్‌బోర్డుపై నిల్చోగా సత్తుపల్లి రోడ్డులోని సప్తపది ఫంక్షన్‌హాల్ సమీపానికి వచ్చేసరికి ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. దీంతో తీవ్రగాయాలైన పుల్లారావును పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

యువకుడిపై కత్తితో దాడి చేసిన హిజ్రా

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో ఓ యువకుడిపై హిజ్రా కత్తితో దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పెదతండాలోని చికెన్ దుకాణంలో పనిచేస్తున్న యువకుడికి, అదే ప్రాంతానికి చెందిన ఓ హిజ్రాకు మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో ఆ హిజ్రా ఆవేశంతో యువకుడిని విచక్షణారహితంగా పొడవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు స్థానికులు ఆయనను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



నిరసనలో పాల్గొన్న బ్యాంకు ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: ఖాళీ పోస్టుల భర్తీ, తాత్కాలిక ఉద్యోగుల రెగ్యులరైజేషన్, వారానికి ఐదు రోజుల పనిదినాల అమలుతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్(యూఎఫ్‌బీయూ) పిలుపు మేరకు బ్యాంకు ఉద్యోగులు శుక్రవారం సాయంత్రం నిరసన తెలిపారు. ఖమ్మంలోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం ఎదుట జరిగిన నిరసనలో పలువురు మాట్లాడుతూ ఈనెల 7నుంచి మొదలైన దశలవారీ ఆందోళనలు సమస్యలు పరిష్కారమయ్యే వరకు కొనసాగుతాయని తెలిపారు. యూనియన్ల ప్రతినిధులు షేక్ ఇబ్రహీం, ఆర్.శివకుమార్, శ్రీనివాస్ నందన్, పి.చిన్నపరెడ్డి, ఆశాజ్యోతి, కృష్ణవేణి, ప్రసాద్, రాంబాబు, తిప్పయి స్వామి తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో చోరీ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం మమత రోడ్డులోని శివాలయంలో చోరీ జరిగింది. రోజులాగే గురువారం రాత్రి తాళం వేసి వెళ్లిన అర్చకులు, సిబ్బంది శుక్రవారం ఉదయం వచ్చేసరికి ఐదు తాళాలు ధ్వంసం చేసి ఉన్నాయి. దీంతో దేవాలయంలో పరిశీలించగా రూ.4లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలతో పాటు హుండీని ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ మేరకు ఆలయ ఈఓ ఇచ్చిన సమాచారంతో ఖమ్మం అర్బన్ పోలీసులు చేరుకుని ఆధారాలు సేకరించారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

కారేపల్లి: మండలంలోని మాదారంలో పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుగురిని అదుపులోకి తీసుకుని ఒక బైక్, ఫోన్లు, కొంత నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఎన్.రాజారాం తెలిపారు.

కోడిపందేలు ఆడుతున్న ఇద్దరు...

కల్లూరు: మండలంలోని పేరువంచ సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే పక్కన కోడి పందేలు ఆడుతున్న ఇద్దరిని శుక్రవారం అదుపులోకి తీసుకోగా, ఇంకొందరు పరారయ్యారని పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రెండు కోడి పుంజులు, రూ.1,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలుశిక్ష

ఖమ్మం లీగల్: తీసుకున్న అప్పు చెల్లించే క్రమాన చెల్లని చెక్కు జారీ చేసిన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం ఆబ్కారీ కోర్టు న్యాయాధికారి రాళ్లబండి శాంతిలత శుక్రవారం తీర్పు చెప్పారు. ఖమ్మం ముస్తఫానగర్‌కు చెందిన కుతుంబాక ప్రవీణ్‌కుమార్ రోటరీనగర్‌కు చెందిన పోలవరపు రమేష్ వద్ద 2016 ఏప్రిల్‌లో రూ.7లక్షల అప్పు తీసుకున్నాడు. ఈ అప్పులు చెల్లించాలని అడగగా 2017ఆగస్టులో రూ.9లక్షలకు చెక్కు జారీ చేశాడు. అయితే, ఈ చెక్కును బ్యాంకు జమ చేయగా ప్రవీణ్ ఖాతాలో సరిపడా నగదు లేకపోవడంతో తిరస్కరణకు గురైంది. దీంతో రమేష్ తన న్యాయవాది ద్వారా కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. విచారణ అనతరం ప్రవీణ్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు ఫిర్యాదికి రూ.9లక్షలు చెల్లించాలంటూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

అక్క ఇంటికి వచ్చి వెళ్తుండగా అనంతలోకాలకు..

లారీ ఢీకొట్టి పైనుంచి వెళ్లడంతో ఛిద్రమైన మృతదేహం



బొగ్గుల నాగిరెడ్డి (ఫైల్)

తల్లాడ: మండలంలోని రంగంబంజర సమీపాన జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రగాయాలతో మృతి చెందాడు. పెనుబల్లి మండలం ముత్తగూడెంకు చెందిన బొగ్గుల నాగిరెడ్డి(55) గ్యాస్‌సిలిండర్ కోసం టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై కల్లూరు వచ్చాడు. సమీపంలోని తల్లాడ మండలం నారాయణపురంలో సోదరి అవులూరి వెంకటరత్నమ్మ ఉంటుండడంతో ఆమె వద్దకు వచ్చి పలకరించాక తిరిగి బయలుదేరాడు. ఈక్రమాన రంగంబంజర వద్ద ఆయనను వెనక నుంచి తల్లాడ వైపు నుంచి కల్లూరు వెళ్తున్న కంటెయినర్ లారీ ఢీకొట్టింది. లారీ నాగిరెడ్డి పైనుంచి వెళ్లడంతో రెండు కాళ్లు తెగిపడి, శరీరం ముక్కలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, నాగిరెడ్డికి భార్య, కుమారుడు ఉండగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.